కవితా కౌముది

# వెన్నెల మరక

జానకి చామర్తి

కొన్ని తలపులు ..
మనసున వన్నెల మరకల్లాగ అంటుకుని ఉంటాయి,
వాటిని పోగొట్టుకోవాలనుకోము కడిగేసో..తుడిచేసో..
చెప్పేసుకోవాలను కోము ..రంగు పోగొట్టుకుని.
ఉంటాయి అవి అక్కడే.. - !!
జీవితం కొంచం గడిచి అనుభవం మనలను ఎండగట్టి,
కాఠిన్యం మనలను పదును పెట్టి,
ఇదేరా జీవించడంలా,
ఎంత తెలివిగా జీవిస్తున్నామో అని పరస్పరం చూసుకుంటూ నవ్వుకుంటూ మానవ సమూహంలో బతికేస్తున్నప్పుడు ..
హఠాత్తుగా అలవాటుకు భిన్నంగా ఓ పని చేస్తావు. అది నిన్ను తట్టి లేపుతుంది,
అంతరంగం లో దాచుకున్న వెన్నెల మరకను కన్నుల ముందు పెడుతుంది,
మరక ఎందుకన్నానంటే,
నువ్వు తలచుకోవడానికి ఇష్టపడని తీయనితప్పుఅనుకుంటున్నావుకాబట్టి.
అది సతాయిస్తుంది నిన్ను , బదులేం చెపుతావు అంటుంది నిన్ను.-
బదులుగా ఆ మరకని వెలిగిస్తావు పెదవుల మీద నవ్వులాగ,
చెమర్చే కళ్ళ లో తడిలాగ,
గుండెలో గుబాళించే అగరుపొగలాగ..,
చుక్క చుక్కల్లా పెదవులు తాకే తేనె చినుకులాగ..!!

ఎవరూ లేని, ఎవరూ చూడని ఒకచోట నిను నువు అద్దంలో చూసుకుంటున్నట్టు,
నీ అంతరంగంలోకి తొంగి చూసుకుంటావు ,
పారేసుకుంటున్నాననుకున్న ..
ఆ జ్ఞానపకపు దూదిబొమ్మని , గుండెలకు హత్తుకుంటావు..
కళ్ళు మూసుకుని, మనోనేత్రాలు తెరచుకుని..చూసుకుంటావు

మరకలేని తెల్ల జీవితం వెలాతెలా పోవడమే..!

★★★

# మౌనంగానే..!

## సుజాత పి.వి.ఎల్

ఉబుకుతున్న
లావా కుంభంలాంటి
నీ గుండె సిరల్లో
ఓ నల్లటి నిరసన రక్తం
నా వైపు ప్రవహిస్తోంది..
నీ మదిలో ఉన్నది
నేనని మురిసిపోయిన నాకు
నా అవగాహనా లోపాన్ని
వేలెత్తి చూపాక నాకర్థమైంది ఒక్కటే..
గుండె ఎడమ పక్కనుంటే
నేను కుడి వైపుని ఎంచుకున్నానని
కోరికే తప్పైనప్పుడు
ఎవర్ని నిందిస్తే మాత్రం ఏం లాభం?
నవ్వుని మింగే
నాటకీయత నాకు తెలేనప్పుడు
నిందలు తప్పవు,..
వేరొకరు నీ మదిలో ఉన్నారని
నిజంగా తెలియక వచ్చిన
అనుకోని అతిథిని నేను
అనుకునే వెళ్ళిపోతున్నాను మౌనంగా.!!

★★★★★



# గజల్

## వాసుదేవమూర్తి శ్రీపతి

జనం పుట్టినట్టే తెప్పల చెట్లు పుడితే బావుంటుంది
చెట్లన్నీ ఏలికలయ్యి జగమేలితే బావుంటుంది

ఆకాశం సముద్రమైతే వానల కరువుండదు కదా
ఇల కురిసే చినుకులు మొత్తం మొలకెత్తితే బావుంటుంది

ఆకు రాల్చు శిశిరాలెందుకు ఆ దేవుడు సృష్టించాడో
కాలమంత చిగురు పాటల కాలమయితే బావుంటుంది

కొండంత పసిడి రాశైన ఒక్క ఆకు విలువ చేయదు
ఆకుతోడ ఆయువు ముడిని జగమెరిగితే బావుంటుంది

చెట్టు కన్న ఆప్తమిత్రుడు వేరెవడు లేడు శ్రీపతీ
చెట్టు గుణమె మనుషులందరికి పట్టుబడితే బావుంటుంది

★★★★



# గుబాళింపు

చందలూరి నారాయణ రావు

ఆ పేరు సువాసనకు ..
మనసు
జీవితాంతం గుబాళింపు..

రాతి కలలో సైతం
చీల్చుకొచ్చిన చిగురాశ
ఇసుకతిన్నెలలో ఇంకిన
వాంఛతో కలిసి
ఒళ్ళు విరుచుకుంటుంది.

శిఖరంలా మనసును
శిరస్సున మోస్తుంటే
ఏరులా ఆలోచన
ఎగిసిగిసి పడుతోంది.

రోజులకు వయసొచ్చినా
సంవత్సరాలు కురచైనా
పేరుకు సువాసన పోదు.
గుబాళింపు మనసును వీడదు.

★★★



# అర్థిస్తూ

భాగ్యలక్ష్మి అప్పికొండ

మృత్యువుని గెలిచి,
సిగ్గు ని మరచి,
నా ఉనికి ని విస్మరించి,
నిదురని దూరం గా తరిమేసి,
ఆశల ఆశయాల ఆకాంక్షలను గాలికొదిలి,
బ్రహ్మాండాన్ని ఒడిలో భద్రం గా దాచి,
కాగడాల కనుల కావలి కాసి,
మమకారం ఉప్పొంగి న ఎద ఎర్రని ధారల్ని,
ప్రేమతో అనుసంధించి,
ధవళామృతాన్ని,
నీ బోసి నోటికందించి,
మానవత్వాన్ని మరువక
మనిషిగా బ్రతకమని ..
అర్థిస్తూ నీ ముందు చేయి చాస్తున్నారా బుజ్జీ..!!

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

చీకటులు నిండియున్నవి చిక్కగాను
పక్షి రావముల్ లేవు సవ్వడులు లేవు
అరుణకాంతులకెంతయో వ్యవధి యుండె
ఎదురు చూతును భానుని యుదయమునకు

కనులు మూయగలేను మేల్కొనగలేను
కాంతి కనరాదు నా గవాక్షమ్మునుండి
హృదయముద్వేగమయమయ్యెనీ క్షణమ్ము
వీడి నిదురను బయటకు వెడలినాను

ఇంక తూర్పుననినుడుదయింపలేదు
ప్రొద్దు నునువెల్గులింకను పొడమలేదు
ఇనుడు సోకని పొగమంచు దనరుచుండె
నూత్నశోభల తుహినబిందువులు చెలగె

ఏమనందును చిత్రమౌనీ క్షణమ్ము
నేవిధమ్మననీ స్థితినెంచగలను
సవితృకాంతులు లేని యజ్ఞానసీమ
తలపు నిశ్చలమై నిల్చు ధ్యానసీమ

కనులు తెరచి యైహికముల కనగవలెనొ
కనులు మూసి ధ్యానమ్మున మునుగవలెనొ
యామవతి చూపు నిశ్చలమైన త్రోవ
బసగు వేరొక దారి యుషోదయమ్ము

COMMENTS